విజయదశమి

శ్రీమతి యు. సత్యబాల సుశీలా దేవిగారు

౧

[సాయంసమయము — మధురాపురీశ్వరుని భవనంలో చక్కని గది (ప్రవేశం). రాజు జయసింహుడు - రాకుమారి విజయలక్ష్మి - పీఠములయందాసీనులైయుందురు]

"తల్లీ! నిన్ను సమస్తవిద్యాపరిపూర్ణనుగా వించాను ఇక నేను సుపుత్రవంతుణ్ణి కావాలి."

"విపులంగా చెప్పండి, బాబా!"

"సమానవిద్యావంతులగు స్త్రీ పురుషులు - సరిసమానులే గదూ?

"సందేహమేమి?"

"బిడ్డా! నాకు పుత్రభాగ్యము లేదుగదా?"

"ఉన్నదో వారిజీవిత మెట్లుండవలెనని మీయూహ?"

"బాహుబలవిద్యాధనమాత్రసహాయులై తమభావిజీవితరంగమునకు సాధన సామగ్రి సమకూర్చుకోవాలి"

"ధన్యను. బాబా! ఒకరాజుకు ఏకపుత్రికనైన నేను నాకర్తవ్యం నెరవేర్చి మీఋణం తీర్చుకుంటాను - ఈ సుముహూర్తాన్నే వెళ్లిపోతాను నాజీవితరంగంలోకి."

"విజయసహితయగు విజయను మళ్లీ చూస్తానా?"

"అవి భగవన్నిర్ణీతము గదా!"

"సర్వజ్ఞవగు నీమాటకు ప్రతిచెప్పలేను, బిడ్డా"!

"బాబా! విచారమెందుకు? అసమానము అపారములగు విద్యాబలం నాకనుగ్రహించేరు. ఇంకేం కావాలి? మరిచాను-ఈయాభరణాలన్నీ ఒకటీ నాకవసరం లేదు."

(తీసివేయును).

"విజయా!..... ..."

"కాలమతిక్రమిస్తోంది. ఎందుకు విచారిస్తారు, బాబా! నన్ను పుత్రుడిగాభావించండి. ప్రాప్తముంటే మళ్లీ ప్రపంచరంగంలో కలుసుకుందాం - ఆశీర్వదించండి, బాబా!

(పాదములకు నమస్కరించును)

"సఫలీకృతమనోరథవై కన్నులపండువగుము. తల్లీ! నేడు విజయదశమి. నీ జన్మదినము - నేడు నీహృదయమున నాటబడిన ఈ పవిత్రాంకురము - వచ్చేడి విజయదశమికి ఫలాన్వితమై నిన్ను సార్థకనామగ నొనర్చుగాత!'"

"విజయా! అచిరకాలంబు తిరిగిరమ్ము."

౨

[సాయంసమయం - శ్రీనగర రాజోద్యానవనం - ఒకయశోకవృక్షముక్రిందిచలువరాతిపైన రాజు: రామసింహుడు - ప్రధానమంత్రి అభయసింహుడు కూర్చొనియుందురు]

"అభయా! శోభాయుక్తమై, సునిర్మల వాయుసంయుతమై, సుందరంగావున్న ఈ వనంలో, యీసాయంవేళ యెంతఆనందంగా ఉందోచూడు!"

"లోకంలోని ఆనందమంతా మూర్తీభవించినట్లున్నది."

"ఒకానొక యానందం నూతనంగావుద్భవించి ప్రేమాంబువులు వర్షించడంవల్ల, చిరవిచారావృతమైన నాహృదయంకూడా ఈవనంలాగ సంతోషతరంగితమై పోతూన్నది."

"ప్రభూ! ఆ ఉత్కృష్టానందానుభవమీ భృత్యున కనుగ్రహింపవలెనని ప్రార్థిస్తు న్నాను"

"చెప్పరానిదేమి? నాకుగలిగిన పుత్రభాగ్యమే కారణము."

" (ఉలికిపడి) ఇదేమి ప్రభూ! ఇదెట్లు సంభవము?"

"నే నన్నృతవాదినా? అభయా?"

"క్షమించండి ప్రభూ! భావగర్భితమైన తమ గంభీరవాక్కులు సేవకునికర్థం కావడంలేదు."

"బిడ్డా! మనపట్టణంలో ప్రస్తుతం చేయ బడుతూన్న అలంకారవిశేషాలకి కారణం తెలుసునా?"

"దేవర వానప్రస్థాశ్రమం స్వీకరింపదలచి నారు గనుక - తగినవారికి రాజ్యభారం వొప్పగించడానికిగదా - పట్టణం అలంకరించ మన్నారు?"

"ఆభారం ఎవ్వరియందుంపబడునో తెలి యునా?"

"అవ్విషయ మనేకమారులు తమను ప్రశ్నించియు విఫలమనోరథుణ్ణై కాలంనిరీక్షి స్తున్నాను."

"నాపుత్రుడు నాసమక్షముననుండ నిరీ క్షణమెవరికొరకభయా?"

"(రిచ్చపడి) తమసమక్షముననా? ఎవరు? ప్రభూ!"

"నాప్రధానామాత్యుండగు నీయభయ సింహకుమారుడు."

"అసంభవము ప్రభూ! అభయుడు తమ భృత్యుడు."

"భృత్యుడు రాజు, రాజు భృత్యుడుగా మారుతూంటారు. అది ప్రపంచనటన - నీవు నాపుత్రుడివి నాకోర్కెకు వ్యతిరేకించవద్దు"

"క్షమించండి, నాయందట్టియర్హత లేనివో..... ..... ."

"అట్లెన్నటికినిగాదు. నీయందు లోకమం తయు ఏకచ్ఛత్రాధిపతివై పాలింపగల అర్హ తాసామర్థ్యములున్నవి. కాని-చో కేవలం సైనికుడివిగా నాదగ్గరకువచ్చిన నీవింతస్వల్ప కాలంబున నిట్టి యుచ్చదశనొందుటకును, నాకుపుత్రవాత్సల్యము గలుగుటకును కారణ మేమి? నీ ప్రభుభక్తి నిరుపమానము. నీవిద్యా బల బాహుబలంబు లసమానములు. వేయేల? సుగుణముల్ప్రోవగు నీయట్టి రాకుమారుడు ప్రస్తుతరాజలోకంలో కనబడడు - నాబంధు లోకంలో నీకంటెయాప్తులును - నారాజ్యము గ్రహించుటకు నీకంటె అర్హులునులేరు. బిడ్డా! నాపుత్రపదవి స్వీకరింపదగినవారిలో నీవేప్రథ ముడివి. నాఆశలత్రుంచవద్దు. నీవిందులకొప్పు కొననిచో నాయాత్మకు శాంతిలేదు. అభయా! నేను పుత్రవంతుణ్ణికావడం నీకిష్టంలేదా?."

"తండ్రి! మరి నేను మాట్లాడితే మీ మనసు నొచ్చిపోతుంది. ఇంతవరకును మీ యాజ్ఞ జవదాటియెరుగను. నేడునట్లే యగునుగాక!"

(ఆనందముతో అభయుని [redacted]చు కొని శిరముమూర్కొనును) "ధన్యుణ్ణి! క్షత్రియకులాలంకార! అభయా! నీయట్టి సుగుణమణిని పుత్రుడిగా ననుగ్రహించిన భగవంతుడికి ప్రణామసహస్రములు...... కుమారా! పోపుదమురమ్ము. నిర్ణిమిత్త పట్టాభిషేకప్రయత్నాల్నిగురించి అలజడి

పొందుతూన్న ప్రజలకీశుభవార్తచెప్పాలి."

3

[సాయంసమయం - శ్రీనగరసమీపారణ్యం - ఇరువదిమంది విగతజీవులైపడియున్న సైనికులమధ్య ఇద్దరు రాకుమారులు.]

"తేజోశాలీ! నన్ను మహాపదనుండి కాపాడిన నీవెవరివి?"

"మిత్రమా! నేనుకాపాడు టనగానేమి? అదంతా భగవదనుగ్రహం. మాది శ్రీనగరము. నన్నభయు డందురు."

"రామసింహభూపాలుని వరపుత్రుడివి నీవా? నే డెంతసుదినము! తండ్రికి తగిన కుమారుడివిగాదా? బాలుడవయ్యు నీశౌర్య మసమానము."

"మిత్రమా! తమనామధేయము తెలిసికొనవచ్చునా?"

"పారిజాతనగరపు యువరాజును - నన్నమరుడందురు."

"అయినచో మీాసైనికులెచట? - మీాకీయాపదెట్లు వచ్చినది?"

"నేను ప్రకృతిసౌందర్యపిపాసిని. అందుచేత అప్పుడప్పుడిలా ఒంటరిగా యీాసుందరారణ్యాల్లోతిరుగుతూంటాను - అసూయాగ్రస్తుడైన పిరికిపందయెవడో రహస్యంగా నన్ను చంపాలని వీళ్లనిపంపి ఉంటాడు."

"సన్మార్గులకు భగవంతుడేతోడు. కాని మిత్రమా! ఎన్నడైన నిట్లొంటరిగవచ్చుట ప్రమాదకరముసుమా!"

"నిజమే - ఇంతటినుండియు జాగ్రత్తగా వుంటాను (పైకిచూచి) మిత్రమా! సూర్యుడస్తమిస్తున్నాడు. ఇక్కడవుండడం మంచిదిగాదు - నీవున్నూ పారిజాతానికివచ్చి నేను చేసే అతిథిసత్కారంపొంది - నన్ను సంతోషపెట్టాలి. నీరుణం నే నీజన్మలో తీర్చుకోలేను"

"నన్ను స్తుతించవద్దని ప్రార్థిస్తాను. సహాయమనేది ప్రతిమానవునికిని, అందునను క్షత్రియునికి ముఖ్యకర్తవ్యము. అందు నాగొప్పతన మేముంది? నారాకనటుంచి, నీవున్నూ అంతదూరంలోవున్న పారిజాతానికిప్పుడుపోవడం మంచిదికాదు-కాబట్టిమరొక మాట చెప్పకుండా నావెంట శ్రీనగరానికి వచ్చేసి రేపువెళ్లవచ్చును."

"(ఆలోచించి) సరే, నీయిష్టమే కానిమ్ము. శత్రుభయంతో ఇక్కడ ఇంకా ఉండడం కూడనిపని - త్వరగాపోదము రమ్ము."

4

[శ్రీనగరరాజభవనంలోని ఒకకోణము-రాత్రిసమయం రామసింహాభయసింహులు - అమరసింహుడు రజతపీఠముపైన ఆసీనులైవుందురు]

రామసింహుడు

అమరా! సకలవిద్యావిశారదుడవనీ, అసమానబలపరాక్రమసంపన్నుడవనీ, నిరుపమానసౌందర్యరాశివనీ, నీకీర్తి వినడమే గాని నేను ప్రత్యక్షంగా చూడగలిగినాను. సంతోషము కుమారా! నీవివాహమైనది గదా?

అమరసింహుడు

(సిగ్గుతో) లేదు, కాలేదు.

రామసింహుడు

కారణము—?

అమరసింహుడు

తగినకన్య లేనందున.

రామసింహుడు

నిజమే! నీయట్టి తేజోశాలికి యర్థాంగ

లక్ష్మికాదగిన కన్యను "విధి" ప్రయత్న పూర్వకంగా సృష్టించాలి. చెప్పుము అమరా? ఎట్టిలక్షణవతికి నీహృదయమున స్థానమొసంగదలచితివి?

అమరసింహుడు

అనన్యసామాన్యసౌందర్యనిధియై, స్వార్జితరాజ్యము ప్రజారంజకముగా పాలించునదియైన కన్యనేగాని వివాహమాడనని ప్రతిజ్ఞ చేసియుంటిని.

రామ

నీ కోర్కె ప్రశంసనీయమే గాని, కన్య సులభగాదని దలంచెదను.

అభ

(సాలోచనముగ) అమరా! అట్టికన్యలభించిన తప్పక వివాహమాడెదవుగదా?

అమ

అట్టికన్య గాన్పించవలెనేగాని - సిరిరా మోకాలొడ్డువారుందురా?

అభ

ఆయువతి-ఏకారణముచేనైన కొన్నిదినంబులు పురుషవేషంబున రాజకీయోద్యోగిని యైయున్న . . .

అమ

(అర్థోక్తిలో) అట్టి ఉన్నతాశయరూపిణి నిజముగ కారణాంతరములవల్ల నే రూపమున నున్నను- నీచత ప్రాపించుకొనదు- సంశయింప వలసినపనిలేదు.

రామ

(స్మృతినభినయించుచు) మరచితిని-మధురానగరాధిపునికుమారియు నిట్లే స్వాతంత్ర్యాభిలాషిణియై యిలు వెడలి- సంవత్సరమైన దట. పాపము-జయసింహామహారాజు సౌందర్యవతియు, గుణవతియు, విద్యావతియునగు ఏకపుత్రికావియోగంబుసహింపలేక వెదకుకొనుచువచ్చి నేడుమనకతిథిగావున్నాడు. దైవయోగంబున, నాకుమారి అమరుని భార్యయైనదో

అభ

(ఆత్రముతో) తండ్రి! యామహాత్ము డెచట నున్నాడు?

రామ

అదిగో! సమయానికే వస్తున్నారు.

—ప్రవేశము జయసింహుడు.

[అభయుడు "తండ్రీ!"యని జయసింహునిపాదములపై పడిపోవును]

జయ

(అభయుని లేవనెత్తి ముఖముకేసిచూస్తూ) 'విజయా! నాభాగ్యలక్ష్మి! నీవేనా?' (కౌగలించుకొని శిరముముద్దాడును)

రామ

శ్రీనగరాధిపుడగు అభయుడు! . . .

విజయ

అవునుతండ్రి!ఆఅభయుడే ఈవిజయలక్ష్మి. (అమరునికేసిచూస్తూ లోనికిపోవును.)

రామ

మిత్రమా! ఈపారిజాతనగరాధిపతి మన కల్లుడుకానుండుట యింతకన్న భాగ్యము సుమా!

జయ

సుదినముగదా? అదెట్లు?మిత్రమా!

రామ

ఈకుమారుడు నీతనయంబోలు లక్షణవతిని వివాహమాడుటకు ప్రతిజ్ఞ చేసినాడట-

నీతనయకరగ్రహణముచే ప్రతిజ్ఞ పూర్తవుతుంది. కాదా? అమరా!

అమరు

(తలవంచుకొని) పూజ్యులిట్లువచించుట నాపూర్వపుణ్యంగా భావిస్తూన్నాను.

—ప్రవేశము నిజరూపంతో విజయలక్ష్మి

విజ

(రామసింహునిపాదములు గ్రహించి) తండ్రీ! పురుషరూపంతో మిమ్ము మోసం చేసేను. క్షమించవలెను.

రామ

(లేవనెత్తి) తల్లీ! మోసముగాదు. నాయెడల భగవంతుడనుగ్రహించినవరము-సుపుత్రుడొనర్పదగినపని పుత్రియొనర్చుట భాగ్యముగదా? బిడ్డా! మునుపటికంటె నాసంతసము శతాధికము.

విజయ

(జయసింహునికరములు నిజకరమున గ్రహించి) బాబా! నాడు "విజయదశమి" నేడు "విజయదశమి" మీయాశీర్వాదము-నామనోరథము సఫలమొనర్చిన భగవంతునికి ప్రణామములు. మీరుకోరిన విట్టి శుభదినములు గాదా? బాబా!

జయ

విజయా! సార్థకనామధేయవగు నీవు పుత్రికవై యుండ శుభములకు కొరతవకునా. బిడ్డా! శుభమయంబులగు నిట్టి 'విజయదశమీ' శతంబులనుగాంచి సుఖింతురుగాక!

రామ

బిడ్డలారా! ఇటురండు-(విజయ, అమరుల కరములనుగ్రహించి) ఈపర్వదినంలో ఎకీభావమందిన మీకరకమలములు చిరకాలమునకును వియోగమునొందకుండునుగాక! మీగుణంబులవలె మీదాంపత్యంబును ఆచంద్రతారార్కము ఆదర్శరూపమై వెలుగొందునుగాక! సకలైశ్వర్యసంపన్నులై "విజయదశమీ" శతంబులు నిరాటంకముగ రాజ్యపాలనమొనర్తురుగాక! (ఇరువురి కరముల నొక్కచో చేర్చును.)

జయ

తథాస్తు! తథాస్తు! తథాస్తు!

రామచంద్రప్రభూ!

శ్రీమతి పి. సీతారామమ్మ గారు

శా. నిన్నేరీతిభజింపనిష్టమగునో నేర్పంగరాదయ్యా! యా
పన్నన్ నిన్నటులెంచి నీకరుణకున్ బాత్రంబునౌదాన
న్నీ కన్నన్మించిన దీనరక్షణచణున్ గానంగలే నింక నా
కన్నన్ దీననుగాన వేలుకొనువేగన్ రామచంద్రప్రభూ!

శా. ఱెక్కల్ వోయినపుల్గుపోల్కి మనుదారిన్ జేరలేకుంటి నీ
దిక్కేనమ్మితి నింతపై జిలుక నీదివ్యత్కృపావార్థితా
స్రుక్కంబోవునె, జాలమేల, శరణంచున్ వేడుచున్నట్టి నా
యిక్కట్లోదఁ గరావలంబమిడుమోయీ రామచంద్రప్రభూ!